# జీవితం విలువ

శ్రీమతి శారద

సుబ్బడు ఒక్కడే వాళ్ళమ్మకి. సుబ్బడు నాన్నని ఎరగనే ఎరగడు. విశాలమైన ప్రపంచంలో దరిద్ర బాధా పీడితులైన అనేకమందిలో, సుబ్బడూ, వాడితల్లీ—సభ్యులు... అంచేత, సుబ్బడు, చిన్నప్పుడు, ఇంకా పెద్దింటిపిల్లలు మొహాం కడుక్కోడం చాతకాని ఈడులో నన్నమాట, ప్లీడరు రామదాసుగారింటిలో, పిల్లల్ని ఎత్తుకోటానికీ, ఆడించటానికీ చేరాడు. వాడికి సరిగ్గా తెలీకపోయినా, అనేక విషయాలు, రామదాసుగారింట్లో, దెబ్బలతో, చివాట్లతో తెలిసి వొస్తుండేవి. పనివాడు, జితం తీసుకుంటాడు. వాడ్ని ఎంతవరకువాడుకోవాలో, ఏమిటో, రామదాసుగారి సంసారంలోని 12 మందిసభ్యులకీ క్షుణ్ణంగా తెలుసు. తెలియని, చిన్నపిల్లలకి పెద్దవాళ్లు తెలియజేసి తమ బాధ్యత నెరవేర్చుకున్నారు. పెద్దవాళ్ళు చివాట్లు వేస్తోవుంటే, సుబ్బడు తలొంచుకుని ఉండేవాడు. చిన్నపిల్లలు తంతే, ఏడవకూడదని ఏడేళ్ళ సుబ్బడికి తెలుసు! రామదాసుగారింట్లో పనిచేస్తున్నంతసేపూ, ఎవరూ నేర్పకుండానే, వేదాంతం బోధపడిందా, అన్నట్టు అన్నిట్నీ భరించే సుబ్బడు రాత్రి పూట తల్లివడిలో పడుకుని,

"ఈయేల, చిన్నబ్బాయి గారు కొట్టిండే, కొస్తోండే" అని ఆరోజు తనకి జరిగిన బహుమానం తల్చుకుని వెక్కి వెక్కి ఏడ్చేవాడు.

గాఢమైన మాతృప్రేమతో, సుబ్బడితల్లి గంగి, కొడుకుని, "ఊరుకో అయ్యా, మన రాత, ఏంచేతాం" అని ఓదార్చి నిద్రపుచ్చేది. అంతకన్న ఆ ముసలి తల్లికి తమ దుర్భరదారిద్ర్యానికి కారణాలు తెలీవు. తెలుసుకుందామనే ప్రయత్నమూ లేదు. ఏ బాధనైనా భరించి, జానెడు పొట్టని సగమైనా పూడ్చాలనేదే ఆమె తన

కొడుక్కు నేర్పగల్గిన ఆదర్శం; ఆమె అనుభవపూర్వకమైన, ఆదర్శంగూడా.

ఒకనాడు, సుబ్బణ్ని రామదాసుగారి పన్నెండేళ్ల అబ్బాయి, కిందపడేశాడు. సుబ్బడికి, మోకాలు అంగుళం లోతుకి గాయపడింది. వెంటనే, సున్నం వేయించింది, రామదాసుగారి భార్య. చాలాసేపు ఏడుస్తూఉంటేను.- "ఏం వగలురా వెధవా, మోకాలు దోక్కుపోతే, గంటసేపణ్ణించి ఏడుస్తున్నావు" అని సుబ్బణ్ని మందలించింది ఆమహాతల్లి. రాత్రి యింటికివొచ్చి సుబ్బడు, చాలాసేపు ఏడ్చాడు; మామూలుగా తల్లివడిలో నిద్రపోయాడు అన్నీమరిచి. తెల్లారి కుంటుతూ పనికి వెళ్లాడు. "వెళ్ళక పోతే, యెట్లా, బువ్వ కావద్దూ?," అంది వాళ్ళమ్మ.

౨

దీపావళికి వారం ముందునుంచీ ఊళ్ళో, టపాకాయల మోత వింటున్నాడు సుబ్బడు. రామదాసుగారింట్లో కూడా పువ్వొత్తులు, జిల్లీలు కాలుస్తున్నారు పిల్లలు. సుబ్బడుఅన్నీ చూస్తూవింటూ, ఆనందిస్తే చాలని గావును, ఆయింట్లో వాళ్ళ అభిప్రాయం. ఒక్కజిల్లీగాని, టపాకాయగాని వాడికిచ్చిన పాపాన పోలేదు ఆపిల్లలు. ఇవ్వాల్సిన అవసరంఏమిటి, వాళ్ళకి? పైగా, సుబ్బడు కుర్రతనం కొద్దీ, ఓజిల్లీ అందరూ చూస్తుండగానే, తీస్తే ముగ్గురు పెద్దలు చివాట్లేశారు, ఇద్దరుపిల్లలు తన్నారు. దొంగతనం విషయమై, ఓపెద్ద ఉపన్యాసం! సుబ్బడికి బోధపడలేదు కాని, ఫలితం స్పష్టంగా తెలిసింది! కళ్ళవెంట నీళ్ళు గిర్రున తిరిగాయి. తనఈడు వాళ్ళు, దున్నపోతుల్లా ఉండే ఆపెద్ద వాళ్లు, అన్ని జిల్లీలు, తోటాలు, మతాబాలు కాలుస్తూ ఉంటే తనకి ఒక్కటికాల్చేహక్కు లేదూ? ఇంత విమర్శగా కాదు, సుబ్బడు ఆలోచించింది; కాని, ఇదే వాడి ఆలోచనలరూపం. వాడికి ఏహక్కుల విషయమూ తెలీదు. తెలియనివ్వటం, రామదాసుగారికుటుంబానికి, ఇష్టం లేదు. ఆ రోజుగూడ రాత్రి సుబ్బడు వాడిఅమ్మతో, జరిగిన విషయం

చెప్పి, భోరునపడ్చాడు. ఏం చేస్తుంది, ఆ తల్లి? పొట్టనిండడమే బ్రహ్మాండమైన జీవితాలకి, కట్టుగుడ్డే కరువైన బతుకులకి, టపాకాయలు కూడానా? ఈ మాటలే, ఆమె మాటల్లో కొడుక్కి చెప్పి పనికి పంపింది పొద్దున. సుబ్బడు, తల్లి ప్రేమ మాటలకి శాంతించి, మారాం పెట్టక వెళ్ళేవాడు పనిలోకి.

3

దీపావళి నాడు పొద్దుణ్ణించి, సుబ్బడికి పిల్లల సరదాలతోటి బొమి కెలుకనపడ్డయ్. పగలు వాడికి రామ దాసుగారింటోనే, బువ్వే శారు, పండగ పుణ్యమాఅని. కాని అంతకన్న ప్రబలమైన కారణం, బుల్లిబాబుని ఎతుకుని తిరగాల్సి ఉండటం. సాయంత్రంపూటదీపాలు పెట్టేం తర్వాత, సుబ్బడు, బుల్లిబాబుని ఎతుకుని అరుగుమూల నుంచుని, పిల్లలు కాల్చేమతాబాల వంకా, తోటాలవంకా చూస్తున్నాడు. వాడికళ్ళు ఆశతో, నిరాశతో, మెరుస్తున్నై. బుల్లిబాబు వాణ్ణిమధ్యమధ్య రక్కుతున్నాడు. అన్నీ ఓర్చుకుని, పిల్లాణ్ణి ఏడవకుండా సముదాయిస్తున్నాడు. కాని బుల్లిబాబుగారికి ఆకలి ఎక్కువై తల్లికోసం గోలపెడుతుంటే, ఆతల్లి "దున్నపోతల్లే వాణ్ణి సముదాయించలేవు, ఎందుకురా నువ్వు దండగ చేటూ..." అని రాగం తీస్తో సుబ్బడి బుగ్గ సాగతీసి, పిల్లణ్ణి ఎతుకుని, గడప మీద కూర్చుని పాలిస్తోంది. సుబ్బడు అరుగు దిగి, వీధ రెండో వైపున రోడ్డుమీదకూచుని, టపాకాయల్ని రంగురంగుల పువ్వొత్తుల కాంతులిని, చూస్తున్నాడు సరదాగా.

రామదాసుగారి పెద్దబ్బాయికీ చిన్నబ్బాయికీ జిల్లీల పందెంలో తగాదాముదురుతోంది. ఒకరికన్న ఒకరు ఎక్కువ కాల్చాలని, జిల్లీల్ని కాల్చి, రోడ్డుమీదకి, ఆకాశం మీదికి విసురుతున్నారు. ఈ సరదాలోనే, లీనమై ఉన్నాడుసుబ్బడు కూడా. పెద్దబ్బాయిగారు, చిన్నబ్బాయిని వెక్కిరిస్తో "చూడరా. వెధవా, నేను తమాషా చేస్తాను" అని ఓజిల్లీ సుబ్బడిమీదికి విసిరాడు. సుబ్బడు తన ఆనందంలోనే ఉండి, కళ్ళు పెద్దవిచేసి, చూస్తు

న్నాడు, కూర్చుని. జుర్, అని మోతపెడుతూ, పెద్దబ్బాయి విసిరిన జిల్లీ, సుబ్బడి కళ్ళకి తగిలింది. సుబ్బడికి, కళ్ళు రెండూ, జిగేలుమన్నాయి. అమ్మో, అమ్మో అనుకుంటూ కళ్ళు నులుముకుంటున్నాడు సుబ్బడు. ఒక్క-క్షణం తర్వాత సుబ్బడికి ఘోరమైన బాధ ప్రారంభమైంది. వెర్రికేక వేశాడు. ఈ కేకతో, ఇదంతా చూస్తూ బుల్లిబాబుకి పాలిస్తున్న రామదాసుగారి భార్యకి భయం వేసింది. భర్తని కేకేసింది. లోపలలా పుస్తకాలు తిరిగేస్తున్న రామదాసుగారు పరుగెత్తుకొచ్చారు. సుబ్బడిగోల, చెప్పనలవిగాకుండావుంది. వకీలు రామదాసుగారు, వాడ్ని ఆసుపత్రికి చేర్చాడు.

౪

ఆసుపత్రి వాకిట్లో సుబ్బడితల్లి గోలుగోలుమనిఏడుస్తూకూచుంది. రామదాసుగారు డాక్టర్ మొహం ఆదుర్దాగాచూస్తూ నుంచున్నాడు. డాక్టరు, సుబ్బడి రెండుకళ్ళకీ కట్లుగట్టి, రామదాసుగారివంక చిరునవ్వుతో చూసి, "ప్రాణభయం లేదుగాని, కళ్ళు పోయినాయి" అన్నాడు. రామదాసుగారి ప్రాణం కుదటపడ్డది."ఆసాంతం నయం చేసి పంపేయండి"అన్నాడు డాక్టరుతో, వకీలుగారు; సరేఅన్నాడు డాక్టర్.

రామదాసుగారు బైటికివొచ్చి, గంగిని ఓదార్చి, "ఇదిగో, నీపిల్లాడికేం ఫరవాలేదు. ఈ పది రూపాయలు తీసుకో"మని ఇచ్చి, వెళ్ళిపోయినాడు మహారాజు. తన ఏడేళ్ళ కొడుకు జీవితం, పదిరూపాయలకన్న ఎక్కు-వ విలువ చేస్తుందని ఆ ముసలి తల్లికి తెలీదు. "మారాజు, పదిరూపాయలు ఒక్క-సారేఇచ్చాడు"అని సంతోషపడ్డది, ఆ హృదయం!

సుబ్బడ్ని పదిహేనురోజుల తర్వాత ఆస్పత్రినుండి, పంపేశారు; సుబ్బడికి, ఈ విశాల సౌందర్యలోకం,అంధమైపోయింది. కర్రసాయంతో, తల్లిచెయ్యిపుచ్చుకుని, తనకి విధింపబడ్డ ఘోర శిక్షను అనుభవించేందుకు, అంధకార బంధురమైన క్రూరలోకంలోకి ప్రవేశించాడు భిక్షమెత్తుకోటానికి, పాతగుడ్డల జోలికట్టుకుని. తనకి ఈ శిక్ష ఎందుకో ఆ కుర్రవాడికేం తెలుస్తుంది?